క్లుప్తంగా

పీడీఎస్ బియ్యం పట్టివేత

రాజోళి: మండలంలోని ముండ్లదిన్నెలో రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. ముండ్లదిన్నెకు చెందిన నాయకి మల్లికార్జున్ గ్రామాల్లో పలువురు ప్రజల దగ్గర రేషన్ బియ్యం తీసుకుని కర్నూల్, రాయచూర్‌కు అక్రమంగా తరలించి అమ్ముతున్నాడు. ఈ క్రమంలో బుధవారం పది క్వింటాళ్ల బియ్యం కొనుగోలు చేసి తన ఇంట్లో స్టాక్ చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఇంటికెళ్లి రేషన్ బియ్యం సీజ్ చేసి మల్లికార్జున్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత



రాజోళి: మండలంలో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న మినీ టిప్పర్‌ను రాజోళి పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్ఐ జగదీశ్వర్ వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గొల్ల తిరుమలేష్ మినీ టిప్పర్‌తో తుమ్మిళ్ల నుంచి పడమటి గార్లపాడు మీదుగా ఇసుకతో వెళ్తుండగా, పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో టిప్పర్‌ను పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'దళితుల ద్రోహి రేవంత్‌రెడ్డి'



గద్వాల అర్బన్: సీఎం రేవంత్‌రెడ్డి దళితుల ద్రోహి అని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలోని మూడు ఎస్సీ రిజర్వ్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఒక ఎంపీ టికెట్ కూడా ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెబుతామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంజనేయులు, ఎల్కూరు భాస్కర్, ఎల్లప్ప, బుచ్చన్న, ఆనంద్, రంజిత్, మహేష్, నర్సింహులు ఉన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

మానవపాడు: మండలంలోని చంద్రశేఖర్‌నగర్‌లో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బుధవారం ఎమ్మెల్యే విజేయుడు బహుమతులు అందజేశారు. రూ.30వేల మొదటి బహుమతి చంద్రశేఖర్‌నగర్‌కు, రూ.20వేలు ద్వితీయ బహుమతి పంచలింగాలకు, రూ.10వేల మూడో బహుమతి బొంకూర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. క్రీడలు మానసిక, శరీరక వికాసాన్ని ఇస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి, శేషు, సంజీవనాయుడు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యవసర సరుకుల పంపిణీ



గట్టు: మండలంలోని తుమ్మలచెరువుకు చెందిన జీవరత్నం కుటుంబానికి మన ఆపద్బాంధవుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిత్యవర సరుకులు అందజేశారు. ఇటీవల జీవరత్నం గుడిసె అగ్నికి అహుతి అయ్యింది. ఈ విషయం తెలుసుకున్న మన ఆపద్బాంధవుల ఫౌండేషన్ తరపున కంసలి హరికృష్ణ, సభ్యులు నెలకు సరిపడ నిత్యవసర సరుకులు, 50 కేజీల బియ్యాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనిత, జగదీశ్వర్‌రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు మహేష్‌నాయక్, శ్రీకాంత్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

'జూపల్లి హిందువులను కించపరిచారు'



రాజోళి: మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన వ్యాఖ్యలు హిందువులను కించపరిచేలా ఉన్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ మీటింగ్‌లో జూపల్లి రామాలయం వల్ల ఉద్యోగాలు వస్తాయా?రామాలయం తిండి పెడుతుందా? రామాలయం కడితే ప్రాజెక్టులు పూర్తవుతాయా? అనడం సరికాదన్నారు. ఆయన వెంటనే హిందువులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బూరెడ్డిపల్లిలో పాల్గొన్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు



ఉండవెల్లి ఆలయంలో రాములవారి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయుడు



తాటికుంటలో సీతారాముల కల్యాణం

రాములోరి కల్యాణం.. కమనీయం

- వైభవంగా సీతారాముల పెళ్లివేడుక
- జిల్లాలోని ఆలయాల్లో ఉత్సవాలు
- పలు ఆలయాల్లో జెడ్పీ చైర్ పర్సన్, ఎమ్మెల్యేలు పూజలు
- శ్రీరామనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- తరలివచ్చిన భక్తజనం

గద్వాల: జిల్లా కేంద్రంలోని పలు దేవాలయాల్లో సీతారామ కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. సీతారాముల కల్యాణం చూసేందుకు భక్తులు ఉత్సాహంతో ఆలయాలకు తరలి వచ్చారు. బీచుపల్లిలోని కోదండరామాలయంలో సీతారామ కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అలంపూర్ జోగుళాంబ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణం సాగింది. ధరూర్ పాగుంట లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం, మల్దకల్ స్వయంభు లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం, గద్వాల మండలంలోని చె



వడ్డేపల్లిలో..



అమరవాయిలో..

నుగోనిపల్లి, సంగాల, కొండపల్లి, గోనుపాడు, పరుమాల గ్రామాల్లో కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో కోటలోని రామాలయంలో సీతారాముల కల్యాణం మంత్రాలయ మఠం ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో రాంనగర్‌లోని రామాలయం, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి ఆలయం, గంజిపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, నది అగ్రహారంలోని శ్రీ సీతారామంజనేయ ఆలయం, అహోబిల మఠం, కృష్ణరోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం, చింతలపేట శ్రీరామాంజనేయ ఆలయం, పిల్లిగుండ్ల అభయాంజనేయస్వామి, రాఘవేంద్ర కాలనీలోని ఆలయాల్లో సీతారాముల కల్యాణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

వివిధ పార్టీల నేతల పూజలు

శ్రీరామనవమి వేడుకలలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్‌తో పాటు పలువురు నాయకులు వేర్వేరుగా వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గద్వాల, ధరూర్, కేటీదొడ్డి ఆలయాల్లో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఆలయాల్లో కల్యాణోత్సవ ఘట్టానికి ముందు జరిగే పూజా కార్యక్రమాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత శాస్త్రోక్తంగా పూజలు చేశారు.

ధరూరు: మండల కేంద్రంతో పాటు ఉప్పేరు, నీలహళ్లి, బూరెడ్డిపల్లి గ్రామాల్లో గద్వాల ఎమ్మెల్యే దంపతులు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, బండ్ల జ్యోతి సీతారాముల కల్యాణ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

అయిజ: మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో భక్తులు సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. పల్లెలు, పట్టణాలు శ్రీరామనామస్మరణతో మార్మోగాయి. సీతారాముల కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి.

మల్దకల్: మండలంలోని వివిధ ఆలయాల్లో సీతారాముల కల్యాణ వేడుక నిర్వహించారు. అమరవాయి, బిజ్వారం, తాటికుంట, కుర్తిరావల్‌చెర్వు, మల్దకల్, పెద్దొడ్డి, నాగర్‌దొడ్డి, మల్లెందొడ్డి, విఠలాపురం, పాల్వాయి గ్రామాలలోని దేవాలయాలో సీతారాముల కల్యాణం కనుల పండువగా సాగింది. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, విక్రంసింహారెడ్డి, ప్రహ్లాదరావు, చంద్రశేఖర్‌రెడ్డి, పటేల్ శ్రీనివాస్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే విజేయుడు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. కోట ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. కల్యాణం పూర్తయ్యాక పానకం, పరమానంతో, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం రాములవారి విగ్రహాలను ఊరేగించారు. సీతారాములు, హనుమంతుని వేషధారణలు, భక్తి గీతాలు, కోలాటాలతో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దామోదర్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, ఎంపీటీసీలు సుంకన్న, రాజశేకర్, కలుగోట్ల పీఏసీఎస్ చైర్మన్ గజేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండల కేంద్రంతో పాటు కొండాపురం, చింతలకుంట, ఇర్కిచేడు, నందిన్నె, కుచినెర్ల గ్రామంలోని సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు స్వామివారికి పురవీధుల్లో పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజలు ఉన్నారు.

రాజోళి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో కల్యాణం అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలో శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని ఆలయాల్లో వేద మంత్రోచ్చరణల మధ్య కనుల పండువగా రాములోరి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామాలపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

గట్టు: మండల కేంద్రంలో సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. గండి ఆంజనేయస్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ముత్యాల పందిరిలో, బ్రాహ్మణ పండితుడు శ్యాంసుందర్‌జోషి ఆధ్వర్యంలో మంత్రోచ్చరణల మధ్య కమనీయంగా నిర్వహించారు. పెంచికలపాడుకు చెందిన మింట్రి వెంకటేష్ స్వామి వారికి గదను బహూకరించారు. అనంతరం భక్తులకు గట్టుకు చెందిన కొర్విపాటి ప్రమీల, పెద్ద అంబుసా దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారు. పెంచికలపాడు, యల్లందొడ్డి, బోయలగూడెం, చిన్నోనిపల్లె గ్రామాల్లోనూ సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి పురపాలికలో, మండలంలోని ఆయా గ్రామాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించారు. శాంతినగర్‌లోని రామాలయ, మారుతినగర్, రామాపురం, కొంకల, జూలెకల్, కోయిల్‌దిన్నె, గాంధీనగర్, పైపాడు, జక్కిరెడ్డిపల్లి, తిమ్మాజిపల్లిలో కల్యాణ వేడుకలు నిర్వహించారు. అనంతరం వీధుల్లో సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వాములవారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో, ట్రాక్టర్లపై ఊరేగించారు.



పాగుంటలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



అయిజలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు



రాజోళిలో స్వామి వారి కల్యాణానికి పీటలు అందిస్తున్న భక్తులు



బోరవెల్లిలో పాల్గొన్న నాయకులు



ఉండవెల్లిలో సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



సీతారాముల విగ్రహాల ఊరేగింపులో చిన్నారుల నృత్య ప్రదర్శన



గట్టులో నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణం



గట్టులో కల్యాణానికి హాజరైన మహిళలు

డాక్టరేట్ సాధించడం అభినందనీయం



డాక్టరేట్ సాధించిన సుధారాణిని సన్మానిస్తున్న వివిధ సంఘాల నాయకులు

గద్వాల అర్బన్: గద్వాల మండలం మేలచెర్వు గ్రామానికి చెందిన సుధారాణి డాక్టరేట్ సాధించడం అభినందనీయమని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో డాక్టరేట్ సాధించిన సుధారాణిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించి జెనిటిక్స్ సైన్స్ విభాగంలో మూర్ఛవ్యాధిపై పరిశోధన చేసి డాక్టరేట్ సాధించారని తెలిపారు. ఉన్నత శిఖరాలు అధిరోధించి సమాజానికి సేవ చేయాలన్నారు. అనంతరం సుధారాణిని శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వాల్మీకి, ప్రేమ్‌కుమార్, మధుసూదన్ బాబు, మోహన్, కోళ్ల ఉస్సేన్, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, రాజు, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, ప్రతాప్ ఉన్నారు.

శ్రీరామ్‌రెడ్డి కృషి మరువలేనిది



రక్తదానం చేస్తున్న శ్రీరామ్‌రెడ్డి అభిమానులు

రాజోళి: ప్రజా సేవకుడిగా, ప్రజల మనిషిగా పేరున్న శ్రీరామ్ రెడ్డి మన మధ్యలో లేకపోవడం చాలా బాధాకరమని అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం శ్రీరామ్‌రెడ్డి 58వ జయంతి ఆయన అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి, రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. గతంలో శ్రీరామ్‌రెడ్డి ప్రజలకు అందించిన సేవలు, రాజోళి అభివృద్ధి కోసం చేసిన కృషి మరువలేనిదన్నారు. ప్రజల పట్ల ఆయనకు ఉన్న అంకిత భావమే నేడు ఆయనను ప్రజల హృదయాల్లో నిలిపిందన్నారు. భౌతికంగా ఆయన లేకపోయినా, ఆయన అభిమానుల గుండెల్లో ఇంకా ఆయన ఆశయాలు సజీవంగా ఉన్నాయన్నారు. అనంతరం ఆయన సతీమణి సంధ్య మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గంగిరెడ్డి, ఆర్డీఎస్ మాజీ చైర్మన్ సీతారామి రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, అశోక్ రెడ్డి, రషీద్, శ్రీరామ్‌రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

సందెపురాళ్ల పోటీ విజేతలకు నగదు బహుమతి



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న మాజీ సర్పంచ్ ధనలక్ష్మి

గట్టు: శ్రీరామనవమి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో సందెపురాళ్ల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలువురు ఔత్సహికులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో గువ్వల పరశురాముడు 100 కేజీల చేతిరాయిని ఎత్తి మొదటి బహుమతి రూ.5016లు దక్కించుకున్నారు. బండమీది అంజి 85 కేజీల చేతి రాయిని ఎత్తి ద్వితీయ బహుమతి రూ.3016లు దక్కించుకున్నారు. లింగాల కిట్టు 80 కేజీల చేతి రాయిని ఎత్తి తృతీయ బహుమతి రూ. 2016లు అందుకున్నారు. విజేతలకు మాజీ సర్పంచ్ ధనలక్ష్మి, కాంగ్రెస్ నేత శ్రీనాథ్, ఆలయ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు. దాతలు మాజీ ఎంపీటీసీ అలేఖ్య, ముంతనాగరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం

కేటీదొడ్డి: కాంగ్రెస్ పార్టీ పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తుందని జెడ్పీచైర్‌పర్సన్ సరిత అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ అభ్యర్థి మల్లు రవి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ హాజరై మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఫ్రీ కరెంట్, 10 లక్షల రైతు బీమా, ఉపాధి కూలీలకు రోజుకు రూ.400 చొప్పున అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ రాష్ట్ర వినియోగదారుల చైర్మన్ గట్టు తిమ్మప్ప, మధుసూదన్‌బాబు, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



అయిజ: పట్టణంలోని పెట్రోల్ బంక్ చౌరస్తాలో బుధవారం చారిటబుల్ సొసైటీ పాస్టర్స్ అసోసియేషన్ వారు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు పాస్టర్ ఆనోకు పాస్టర్ మాట్లాడారు. వేసవిలో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని బాటసారులకు చల్లటి నీరు ఇచ్చి దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు మంచినీరు తాగి ఎండ నుంచి రక్షించుకోవాలని కోరారు. కార్యక్రమంలో చారిటబుల్ సొసైటీ పాస్టర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పాస్టర్ వసంత్ కుమార్, పాస్టర్ కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంతో పాటు వేముల గ్రామంలో బీజేపీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఎంపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వేరుశనగ పంట సాగుచేసుకోండి



తూంకుంట శివారులో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏడీఏ సక్రియా నాయక్

అయిజ: అలంపూర్ నియోజకవర్గంలో కత్తెర పంట సీజన్‌లో రైతులు వేరుశనగ పంటను సాగుచేసుకోవాలని ఏడీఏ సక్రియా నాయక్ సూచించారు. మండలంలోని తూంకుంట శివారులో సాగుచేసిన వేరుశనగ పంటను బుధవారం ఆయన పరిశీలించారు. ఉగాది పండుగ రోజు నుంచి బావులు, బోరు బావుల కింద నీటి వసతి ఉన్న రైతులు వేరుశనగ పంటను సాగుచేసుకోవచ్చని సూచించారు. ఈసీజన్‌లో వేరుశనుగ పంటను సాగుచేయడం వలన చీడపీడల సమస్య తక్కువగా ఉంటుందన్నారు. ఈ సీజన్‌లో వేరుశనగ పంటను సాగుచేస్తే అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు.

అన్నదాన సత్రానికి కూలర్ల విరాళం



కూలర్లను ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్, పాలకమండలి సభ్యులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ బ్రహ్మేశ్వర నిత్యాన్నదాన సత్రానికి రెండు కూలర్లను హైదరాబాద్‌కు చెందిన మదమంచి వేణుమాధవ్, కరుణారావు దంపతులు అందజేశారు. వాటిని శ్రీరామనవమి రోజు ఆవిష్కరించి భక్తులకు అందుబాటులోకి తెచ్చినట్లు ఆలయ పాలక మండలి చైర్మన్ చిన్నకృష్ణయ్య తెలిపారు. బ్రహ్మేశ్వర నిత్యాన్నదాన సత్రంలో ప్రతిరోజు వందలాది మంది భక్తులు భోజనాలు చేస్తున్నారన్నారు. వేసవి కాలం కావడంతో భక్తులు చల్లటి గాలిలో ప్రశాంతంగా భోజనం చేసే సదుపాయం కల్పించాలన్న తలంపుతో తనవంతుగా వేనుమాధవ్, కరుణారావు దంపతులు వాటిని అన్నదాన సత్రానికి విరాళంగా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌తో పాటుగా ఆలయ పాలక మండలి సభ్యులు నీలప్ప, సీ వెంకటేష్, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటనారాయణ, ఆనంద్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిక్కవీరప్ప రథోత్సవం

కేటీదొడ్డి: మండలంలోని ఇర్కిచేడులో తిక్కవీరప్ప జాతర రథోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరై పూజలు చేసి రథోత్సవం లాగారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఇర్కిచేడులో గోవిందనామస్మరణ మార్మోగింది. భక్తులు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా పలు మిఠాయి, ఇతర దుకాణాలు వెలిశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు శ్రీధర్, ఉరుకుందు, టీచర్ గోవిందు, హనుమంతు, గోపి, భగవంతు, జంగిలప్ప, నాయకులు పాల్గొన్నారు.



ఇర్కిచేడులో రథానికి పూజలు చేసి లాగుతున్న ఎమ్మెల్యే బండ్ల, ప్రజలు